దశాబ్దాల కల..లో వోల్టేజీ గోల

- రెండు మండలాలకు తీరనున్న కరెంటు కష్టాలు
- ప్రారంభానికి సిద్ధమవుతున్న 132/33 కెవి సబ్ స్టేషన్
- ఎమ్మెల్యే పట్టుదలపై కర్షకుల ప్రశంసలు



ప్రజాశక్తి- వీకోట: మండల పరిధిలో లోవోల్టేజీ పరిష్కారానికి నాటి పాలకులు రైతుల్ని మభ్యపెట్టారు... కర్షకుల కష్టాల్ని కళ్లారా చూసిన స్థానిక శాసనసభ్యులు ఆరుగాలం కష్టించే రైతన్నకు దన్నుగా నిలబడ్డారు... పట్టుబట్టి పెద్ద సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించారు... పనులు శరవేగంగా సాగుతున్నాయి... మరో రెండు నెలల్లో అన్నదాతల కంట ఆనందాన్ని చూసే గడియలు సమీపిస్తున్నాయి... నాణ్యమైన విద్యుత్తో సిరులు పండించే తరుణం ముంచుకొస్తోందని రైతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు. లో వోల్టేజ్ శాశ్వత పరిష్కారానికి బాటలు వేసిన శాసనసభ్యుడిపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

మూడు రాష్ట్రాల కూడలి అయిన వికోట మండలంలో సుమారు 20వేల ఎకరాల సాగుభూమి ఉంది. వాణిజ్య పంటలకు ప్రసిద్ధి. టమోటా, బీన్స్, క్యాబేజ్, బంగాళదుంప, మిరప, బంతి, చామంతి, దోస, సోర, కాకర, అరటి, స్వీట్ కార్న్ తదితర పంటలు విస్తారంగా సాగుచేస్తారు. అధిక మొత్తంలో బోరు బావులపై ఆధారపడి పంటలు పండిస్తారు.. వీటికి తోడు పలు ఫ్లోర్ మిల్లులు, లేత్‌లు, వెల్డింగ్ షాపులతో పాటు పట్టణంలో విద్యుత్ వినియోగం అధికమైంది. ప్రధానంగా కొన్నేళ్లుగా విద్యుత్ సమస్య రైతులను పట్టిపీడిస్తోంది. ఈసమస్యతో బోరు మోటార్లు, స్టార్టర్లు పాడైపోతున్నాయి. పంటలు ఎండిపోతున్నాయి. పెట్టుబడులు కోల్పోవాల్సి దుస్థితి నెలకొంది. నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేయాలని రైతులు ఏళ్ల తరబడి మొత్తుకున్న పాలకులలో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి 132 సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టలేదు. అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే వి.కోట మండలానికి చెందిన శాసనసభ్యులు వెంకటేగౌడ రైతులకు నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేయాలని సంకల్పించారు. 132/33 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్లారు. విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సారథ్యంలో సబ్‌స్టేషన్ కొరకు పలుమార్లు పోరాడారు. ఎట్టకేలకు మంజూరు చేయించుకున్నారు. ట్రాన్స్కో అధికారులు విద్యుత్‌స్టేషన్ నిర్మాణం కొరకు భూములు వెతుకులాట మొదలు పెట్టారు. భూములు ఇచ్చేందుకు ఎవరు ముందుకు రాలేదు. ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోవడంతో సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనువైన భూములు కనపడలేదు. దీంతో ఎమ్మెల్యే తన సొంత గ్రామంలో రైతులతో చర్చించారు. రెండు మండలాల రైతులందరికీ సబ్‌స్టేషన్ ప్రయోజనం గురించి వివరించారు. ఐదుగురు రైతులు 10ఎకరాల సాగు భూమిని సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దగ్గరుండి రైతులకి సంతప్తికర పరిహారం అందించి భూసేకరణ ప్రక్రియ త్వరిత గతిన పూర్తి చేయించారు. సబ్‌స్టేషన్ పనులు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభమయ్యాయి. రెండు నెలలుగా సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. టవర్ల నిర్మాణం, విద్యుత్ నియంత్రికల అమర్చడానికి బేస్మెంట్ తదితర పనులు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. మార్చి ఆఖరి కల్లా సబ్‌స్టేషన్ అందుబాటులో రానున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. కర్షకులకు మేలుచేయాలన్న శాసనసభ్యుడి పట్టుదలపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే వి.కోట, బైరెడ్డిపల్లి మండలాల రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుంది.

వి.కోట మండలంలో 3650 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. బైరెడ్డిపల్లి మండల పరిధిలో 6100 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతిఏటా కొత్తగా 200 నుంచి 500 విద్యుత్ కనెక్షన్లు కొరకు రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ లెక్కన ప్రతిఏటా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల సంఖ్య పెరుగుతోంది. అధిక మొత్తంలో విద్యుత్ వినియోగిస్తారు. లో వోల్టేజ్ కారణంగా విద్యుత్ కోతలు భారీగా పెరుగుతున్నాయి. విద్యుత్ కోసం రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. నాణ్యతలేని విద్యుత్ సరఫరాతో విద్యుత్ నియంత్రికలు కాలిపోతున్నాయి. వేసవి ఆరంభం నుండి విద్యుత్ కోసం అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. బోరు బావుల వద్ద కాపు కాస్తున్నారు. పంటలను రక్షించుకోలేక సతమతమవుతున్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో లో వోల్టేజ్ సమస్య నుంచి బయటపడతామని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించే కర్షకుల కష్టానికి ఫలితం దక్కి రైతులు ఆర్థికంగా బలపడి రైతేరాజు అన్న స్వప్నం నెరవేరుతుందని రెండు మండలాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

తీరనున్న కరెంట్ కష్టాలు

- చిన్నప్ప, ఏడి, పలమనేరు డివిజన్

నియోజకవర్గంలోనే వెనుకబడిన ప్రాంతాలైన వికోట, బైరెడ్డిపల్లి మండలాల్లో నెలకొన్న లో వోల్టేజ్ సమస్యను అధిగమిచ్చేందుకు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి సహకారంతో వికోట మండలంలో వేగంగా సాగుతున్న132/33, కేవి సబ్‌స్టేషన్ త్వరలో ప్రారంభం కానున్నడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. లోవోల్టేజ్ సమస్యను అధిగమించి నాణ్యమైన విద్యుత్తును రైతులకు, ప్రజలకు అందించేందుకు ఈ సబ్ స్టేషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

16న గ్రామీణ బంద్

జయప్రదం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకుల పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న రైతు, కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఈనెల 16వ తేదీ జాతీయ స్థాయిలో నిర్వహించే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని మంగళవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన కార్మిక, కర్షక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం పిలుపునిచ్చాంది. రౌండ్ టేబుల్ సమావేశం పి.చైతన్య అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచివరం సురేంద్రన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కర్షకులకు కన్నీళ్లు తెప్పిస్తున్నారని, ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు నిమ్మకు నెరెత్తినట్టు ఉండడం దారుణమన్నారు. రైతులకు స్వామినాథన్ కమిటీ సిఫారసుల మేరకు మద్దతు ధరలు చట్టం చేయాలన్నారు. నాలుగు లేబర్ కోర్టులను రద్దు చేయాలన్నారు. ఈనెల 16న జరుగుతున్న గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా నాయకులు మునిరత్నం నాయుడు మాట్లాడుతూ కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం చేయాలన్నారు. భూహక్కుల చట్టం 27/23ను ఉపసంహరించాలని అన్నారు. సమగ్ర పంటల భీమా పథకాన్ని పెట్టాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి హెచ్.ఓబుల్‌రాజు మాట్లాడుతూ ఉపాధి హామీకి రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు. అలాగే ఆన్లైన్ మస్టర్ రద్దు చేయాలన్నారు. అటవీ హక్కుల చట్టం సవరణలను ఉపసంహరించాలన్నారు. ఏఐటియుసి జిల్లా నాయకులు ఎస్. నాగరాజన్, దాసరి చంద్ర మాట్లాడుతూ పరిపాలన చేసేవారు నిజాయితీగా చేయాలని నిరంకుశత్వానికి పాల్పడితే ప్రజలే పాలకులకు బుద్ధి చెబుతారని విమర్శించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.చైతన్య, ఉపాధ్యక్షులు వాడ గంగరాజులు మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల మెడపై పెట్టిన కత్తి హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ఫిబ్రవరి 16వ తేదీన జరుగుతున్న గ్రామీణ బంద్‌ను ట్రాన్స్పోర్ట్ సమ్మెను పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతిరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బిల్డింగ్ వర్కర్స్ డబ్బులను తిరిగి ఇవ్వాలని, బిల్డింగ్ కార్మికుల సమస్యలను నిజాయితీగా పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లోకయ్య, రమాదేవి, ఆటో యూనియన్ నాయకులు ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కమిషనర్

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ మంగళవారం ఉదయం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశించిన సౌకర్యాలు కల్పన, చేపట్టిన పనులను పరిశీలించారు. నగరపాలక పరిధిలో షర్మన్ బాలిక ఉన్నతపాఠశాల, సీకే.పల్లి ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ ఐటిఐ, బ్రిడ్జి స్కూల్, గాండ్లపల్లి ఉన్నత పాఠశాలలోని 11 పోలింగ్ కేంద్రాలను కమిషనర్ తనిఖీ చేశారు. ప్రధానంగా నీటిసరఫరా, విద్యుత్, ఫర్నిచర్, మరుగుదొడ్లు, ర్యాంపుల నిర్మాణాలను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్దేశించిన పనులు వేగంగా పూర్తి చేసేలా ఇంజనీరింగ్ విభాగం ఏఈలు, డీఈలు సత్వరం చర్యలు చేపట్టాలన్నారు. జరుగుతున్న పనులను రోజువారిగా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, డీఈలు వెంకట ప్రసాద్, రమణ, ఏఈలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

క్షుణ్ణంగా ఓటరు నమోదు

సవరణల దరఖాస్తు పరిశీలన : ఏఈఆర్వో, కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఓటరు నమోదు, సవరణల కోసం అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, బీఎల్వోలు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా విచారణ చేపట్టాలని ఏఈఆర్వో, కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో చిత్తూరు అర్బన్ పరిధిలోని బిఎల్వోలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. తుది ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత స్వీకరించిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. కొత్తగా ఓటర్ నమోదుకు అందిన ఫారం 6, పారం 7, ఫారం 8, 8ఎ లను బిఎల్వోలు కచ్చితంగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. తగిన ధ్రువీకరణ పత్రాలు, సంతకాలు తీసుకొని ఆమోదం, తిరస్కరణ కోసం సూపర్వైజర్ అధికారులకు సమర్పించాలన్నారు. బిఎల్వోలు సిద్ధం చేసిన దరఖాస్తులను సూపర్వైజర్ అధికారులు జాగ్రత్తగా తనిఖీ చేయాలన్నారు. ఆమోదం, తిరస్కరణ దరఖాస్తులను ఏలాంటి పొరపాట్లు లేకుండా అప్లోడ్ చేయాలన్నారు. ఫోటోల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు కషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, ఏసిపీ రామకష్ణుడు, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, సూపర్వైజర్ అధికారులు, బిఎల్వోలు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన డ్వామా పిడి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద వంద రోజులు పనిదినాలు కల్పించాలని డ్వామా పిడి ఎన్.రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం తవణంపల్లె మండలం దిగువతడకర, తవణంపల్లి, పుణ్యసముద్రం గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను డ్వామా పిడి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా తవణంపల్లి హౌసింగ్ కాలనీ, ఫారం పాండ్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్, దిగువతడకర నందు సరిహద్దు కందకాలు, ఫారంపాండు, పుణ్యసముద్రంలో కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఉపాధి కూలీలతో వేతనాలు సక్రమంగా వస్తున్నాయా లేదా దినసరి వేతనం ఎంత వస్తున్నదని అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, విభిన్న ప్రతిభావంతుల కుటుంబాలకు ఎక్కువగా పనికల్పించాలని, క్షేత్ర సహాయ సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఉపాధి కూలీలను పెంచి లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీలో జాబ్‌కార్డు కలిగి ఉన్న వారందరికీ ఉపాధిపనులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపిఎం బి.సుబ్రహ్మణ్యం, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడి రాజేఖర్

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణే ధ్యేయం: ఎస్పీ జాషువా

తడుకుపేట చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణే ధ్యేయమని ఎస్పీ జాషువా అన్నారు. మంగళవారం రాష్ట్ర సరిహద్దు తడుకుపేట వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. తనిఖీలు ఎలా చేయాలో సిబ్బందికి నిశితంగా వివరించారు. ఆలసత్వం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు అనుగుణంగా విస్తత బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రలోభాలను అడ్డుకట్ట వేసేలా ప్రణాళికలు రచించామన్నారు. అసాంఘిక శక్తుల కదలికపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు ఇప్పటికే పోలీస్‌శాఖ కనుసన్నల్లోకి తీసుకుందన్నారు. నిరంతర సోదాలు జరుగుతున్నాయన్నారు. ఒక్కొక్క చెక్‌పోస్టులో పటిష్ఠమైన సిబ్బందిని ఏర్పాటుచేశామని వారు మూడు షిఫ్టులు పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ గంగిరెడ్డి, సీఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

గంగాధర నెల్లూరు: మండల పోలీస్ స్టేషన్‌ను జిల్లా నూతన ఎస్పీ జాషువా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు తెలియచేశారు. ప్రశాంత వాతావరణంలో రానున్న ఎన్నికలు నిర్వహించేలా ఇప్పటినుంచే ప్రణాళికల రూపొందించాలని ఆదేశించారు. ఆయన వెంట చిత్తూరు పట్టణ డిఎస్పి రాజగోపాల్ రెడ్డి, సిఐలు గంగిరెడ్డి, శంకర్, ఎస్సై రామాంజనేయులు పాల్గొన్నారు.

'వివేకానంద' విజయదుందుభి

జేఈఈ ఫలితాల్లో ...

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఎన్‌టిఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాల్లో నగరంలోని స్థానిక పీఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారని కళాశాల కరస్పాండెంట్ పి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజ తెలిపారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పి.చరిత్ చౌదరి 99.17 శాతం మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అధ్యాపక బందం మంగళవారం స్థానిక కళాశాలలో అభినందించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు చక్కటి బాటలు వేస్తూ పిఎస్ఎన్ వివేకానంద జూనియర్ కళాశాల చిత్తూరు నగరంలో తనదైన ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుందని తెలిపారు. తమ కళాశాలలో 2024 జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 47మంది విద్యార్థులు 80 శాతం సాధించారని మొదటి స్థానంలో చరిత్ చౌదరి 99.17 సాధించగా, రిత్విక్ రాజ్ 97.32, నిహిత్ 96.59, ప్రీతి 96.12, చందన 95.01, మహమ్మద్ సఫ్వాన్ 94.58, పవన్ 94.24, తేజసాయి 94.09, సింధు 93.44, రిషికేశ్ రామ్ 92.21, తారాచంద్ర చౌదరి 91.79, దుర్గా ప్రసన్న 91.05, చాందిని 90.77, సంతోష్ చౌదరి 89.96, మౌనిక 89.55 శాతం ర్యాంకులు సాధించారని తెలిపారు.



జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సత్యనారాయణ

15న రీజినల్ మెగా జాబ్ మేళా

20వ తేదీకి మార్పు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ద్వారా ఈనెల 20న స్థానికఆర్‌విఎస్ నగర్ శ్రీ వేంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ (ఎస్‌విసెట్)లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీజినల్ మెగా జాబ్ మేళాను ఈనెల 15న విజ్ఞాన సుధ కళాశాలలో నిర్వహించాల్సి ఉండగా దీని మార్పుచేస్తూ ఈనెల 20న ఆర్‌వియస్ నగర్‌లోని వేంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (ఎస్వీసెట్) నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ రీజినల్ మెగా జాబ్‌మేళాలో దాదాపు 100కు పైగా కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. 10వ తరగతి నుండి పీజీ ఫెయిల్/పాస్ అయిన 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీలు, పురుషులు అభ్యర్థులు హాజరుకావచ్చునని, ఈవిషయాన్ని గమనించి, ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోగలరని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు. సలహాలు సూచనల కొరకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు సిసింద్రీ 8465830771, రసూల్ 6300954441, అబ్దుల్ 8142509017, వేణు 8374421195 పేర్కొన్నారు.

ఐఐటి జేఈఈ ఫలితాల్లో ...

విజయం విజయకేతనం

ఐఐట, జేఈఈలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: మంగళవారం విడుదలచేసిన జేఈఈ ఫలితాల్లో విజయం విద్యార్థులు విజయకేతనం ఎరుగువేశారని విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయి ఓపెన్ క్యాటగిరలో లోకేష్ 93.75, జగదీష్ ప్రసాద్ 88.77 శాతం సాధించిన అగ్రస్థానంలో నిలిచారని, కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు 80శాతం సాధించారన్నారు. 26 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించిన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల క్రమశిక్షణతో పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చున్నారు. ఈకార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ శైలజామూర్తి, ప్రిన్సిపల్ జీవరత్నం నాయుడు, అధ్యపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో

శ్రీవివేకానంద విజయకేతనం

జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన శ్రీ వివేకానంద జూనియన్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మంగళవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో స్థానిక కొంగారెడ్డిపల్లిలోని శ్రీవివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల నిర్వహకులు మహేంద్ర కుమార్, భాస్కర్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు సిద్దార్థ 99.27, నయన 97.31, భరద్వాజ్ 95.99, మోనిషా 90.94, తరుణ్‌కుమార్ 88.74, ఊహాప్రియారెడ్డి 86.86, కోటేంద్ర 85.71, జోష్నవీ 83.57మార్కులు సాధించిన్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల భవిషత్‌ను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అందిస్తూ విద్యార్థుల భవిషత్తును శ్రీవివేకానంద జూనియర్ కళాశాల తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరుడెస్క్: నగరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ భార్గవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.రవికుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధికారులు, ప్రాధేశిక సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, సింగిల్‌విండో అధ్యక్షులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొనాలని కోరారు.

'జయహో బీసీ'ని జయప్రదం చేయండి: రవియాదవ్

ప్రజాశక్తి-కార్వేటినగరం: రాష్ట్ర టీడీపీ ఆదేశాల మేరకు కార్వేటినగరంలో ఈ నెల 15న(గురువారం) జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జీడీ నెల్లూరు బీసీ సెల్ అధ్యక్షులు రవియాదవ్ తెలిపారు. చిత్తూరు పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముఖరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 10గంటలకు కార్వేటినగరంలోని ముస్లిం కల్యాణమండపంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అన్నదానం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం స్థానికులకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ ఛైర్మన్ జయచంద్రనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం అన్నా క్యాంటీన్‌లు అందుబాటులో లేకపోవడంతో పేదవాళ్ల ఆకలి తీర్చేందుకు ఈ విధంగా ఉచిత భోజనాన్ని వడ్డిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జయప్రకాష్‌నాయుడు, లోకనాథం నాయుడు, హేమచంద్రనాయుడు, గురుస్వామి, మోహన్ నాయుడు, గిరిబాబు, రాజేంద్రనాయుడు, శివ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-రామకుప్పం: మండల కేంద్రంలోని షాదీ మహల్‌కు నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులుగా నాసిర్ భాష, నిజాం, నూర్, ఇలియాజ్, హాసీనా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షాది మాల్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. షాది మాల్ వినియోగంలో లేనందున ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించి మరమ్మతులు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జెడ్పిటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కోకన్వీనర్ చంద్రరెడ్డి, సర్పంచ్ మురళి, ఎంపిటిసి తాజ్ముల్‌బాషా, ఉపసర్పంచ్ ఏజస్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: సామాజిక సేవ రంగంలో సేవలందించినందుకు గాను ప్రపంచ మానవ హక్కుల కౌన్సిల్ ఆధ్వర్యంలో పెద్దపంజాణీ ప్రథమ చికిత్స కేంద్రం నిర్వాహకులు జాఫర్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వే కోడూరులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జాఫర్‌కు మెడికల్ విభాగంలో నేషనల్ బెస్ట్ అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వరల్డ్ హ్యూమన్ రైట్స్ చిత్తూరు జిల్లా మెడికల్ సెల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు. మానవ హక్కుల పరిరక్షణకు ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ఎటువంటి సేవలు అయినా ఎల్లవేళల సేవలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ మస్తాన్ సాహెబ్, వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వ్యవస్థ స్థాపకులు జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎం.ఆర్.అన్సారి, నేషనల్ కన్వీనర్ ఛైర్మన్ ప్రసన్నగోస్వామి, నేషనల్ యాక్టింగ్ ప్రెసిడెంట్ చీఫ్ జనరల్ సెక్రెటరీ గణేష్‌శంకర్ యాదవ్, జాతీయ అధ్యక్షుడు పోపత్ని, సౌత్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ చింతాడ శారద, జాతీయ ప్రధాన కార్యదర్శి హమీదుల్ల అజ్మెన్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రో లెర్నింగ్ సెంటర్‌పై అవగాహన

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు మంగళవారం కామన్‌వెల్త్ ఆఫ్ లెర్నింగ్ కెనడా వారి సహకారంతో రైతులకు వివిధ పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ తరపున విచ్చేసిన టీం లీడర్ పి.తమిజోళి, ఆప్‌కాబ్ మైక్రో లెర్నింగ్ సెంటర్ టీమ్ లీడర్ కె.మస్తాన్‌రావు రైతులకు మైక్రో లెర్నింగ్ సెంటర్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ యాప్‌ను 54దేశాలలో వినియోగిస్తున్నారని మన దేశంలోనూ రైతులకోసం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దీని ద్వారా రైతులు సజ్జ, చెరకు, వేరుశెనగ, వరి లాంటి పంటల సాగు చేయడంతో పాటు ఈ పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణకు ఏ మందులు పిచికారీ చేయాలి, ఎంత మోతాదులో చేయాలి అనే అంశాలపై అవగాహన పెంచుకోవచ్చన్నారు. సందేహాలను అందులోని ఫోన్ నెంబర్లకు సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ అసిస్టెంట్ అర్షియా రహమత్, చిత్తూరు పిడీసీ సేల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయ అధికారి రాఘవేంద్రయాదవ్, సంఘ అధ్యక్షులు తిరుమలరెడ్డి, సీఈవో తులసిపిళ్ళై, సూపర్‌వైజర్ ఆనంద్, శేఖర్, కార్తిక్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-సోమల:
మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ నాగరాజు మంగళవారం పరిశీలించారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను ఆరాదీశారు. సిబ్బందికి, బిఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. వృద్ధులు, వికలాంగుల ఓటు వేసేందుకు సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోఆర్డి లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు మసూద, లలితకుమారి, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఎస్ఐకు సన్మానం

ప్రజాశక్తి - ఓజిలి :
ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ పి రవిబాబును జాతీయ మానవ హక్కుల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు జడ్డ చంద్రశేఖర్ , ఉపాధ్యక్షులు మునిరత్నం, సూళ్లూరుపేట డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ , ఓజిలి మండల అధ్యక్షులు బాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్:
మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మోహిద్దీన్ బాష అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరోజి నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం జాతీయ మహిళా దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మోహిదీన్ బాష మాట్లాడుతూ మహిళలకు ప్రధానంగా విద్య అవసరమని, రాజకీయ, ఉద్యోగ, వ్యాపార, క్రీడా రంగాల్లో మహిళలు ప్రాతినిధ్యం పెరగాలన్నారు. మహిళా విభాగం సమన్వయకర్త డాక్టర్ మాధవి మాట్లాడుతూ మహిళల జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చిట్టికళావతి, రమణమ్మ, విష్ణు ప్రియ, లక్ష్మీ ప్రసన్న, మాధవి, రవి విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి

- సిపిఎస్‌ను రద్దు చేసి, ఓపిఎస్‌ను అమలు చేయాలి
- ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఏపీ జెఎసి జిల్లా అధ్యక్షులు కెవి.రాఘవులు డిమాండ్

నిరసన వ్యక్తం చేస్తున్న ఏపి జేఏసి నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లుకు ప్రభుత్వం చెల్లించవలసిన బకాయిలను సత్వరమే చెల్లించాలని ఏపీ జెఎసి జిల్లా అధ్యక్షులు కెవి.రాఘవులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏపీ ఎన్జీవో అతిథి భవనంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా న్యాయపరమైన డిమాండ్లను 30 శాతం ఫిట్మెంట్ 12వ పిఆర్సిని వెంటనే ప్రకటించాలని పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. లీవులు మంజూరు, జిపిఎఫ్ ఏపీజిఎల్ఐ, మెడికల్ రీయంబర్స్మెంట్ క్లైములు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు పరచి ఓపిఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అన్ని ప్రభుత్వ శాఖలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని ఈనెల 14వ తేదీ నుండి దశల వారీగా నిరసన కార్యక్రమాలు రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రంలో వినతిపత్రాలను సమర్పన, 15,16 తేదీలలో మధ్యాహ్న భోజన సమయాలలో నిరసన, 17న అన్ని తాలూకా కార్యాలయాలు ర్యాలీలు, 21 నుంచి 24వ తేదీ వరకు రాష్ట్ర నాయకులు జిల్లాల్లో పర్యటన, 27న చలో అసెంబ్లీ చేపట్టనున్నట్లు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ వీజీ.రఘు, జిల్లా జేఏసీ జనరల్ సెక్రెటరీ రమణ, చంగల్ రాయమందిడి, నగర అధ్యక్షులు భాను ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన ఏపిటిఎఫ్ నాయకులు

డీఈవోకు శుభాకాంక్షలు చెబుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా నూతన విద్యాశాఖ అధికారి దేవరాజును ఏపీటీఎఫ్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, ఎన్నికల విధులు కేటాయించడంలో గర్భిణీ ఉపాధ్యాయులు, చంటిపిల్లల తల్లులు, 55 పైబడిన ఉపాధ్యాయులకు, శరీరక వైకల్యం గల వారికి, దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడే వారికి ఎన్నికల విధులు కేటాయించడంలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపినాథ్, ప్రధాన కార్యదర్శి ముక్తార్ అహ్మద్, అమర్నాథ్ రెడ్డి, జగదీష్, మధు, వేణువాసు, లక్షిపతి, మహమ్మద్ బాషా పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధిపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లెప్రసీ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం తీర్థం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వ్యాధి వ్యాప్తి, నివారణ, నియంత్రణ, పరీక్షలు గురించి వివరించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం గురించి విద్యార్థులకు సలహాలు ఇచ్చారు. ఆరు మంది వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుండి మంజూరైన ఎంసిఆర్ పాదరక్షలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ పద్మావతి, హెల్త్ ఎడ్యుకేషన్ కాంతమ్మ, డిపిఎంఓ దయానంద, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి: ఎంపీపీ

వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, నాయకులు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఎన్.రెడ్డెప్ప అన్నారు. మండలంలోని బట్టందొడ్డి సచివాలయంలో మంగళవారం స్థానిక సర్పంచ్ అర్చన ఆధ్వర్యంలో రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సింగల్ విండో ఛైర్మన్ శంకరప్ప, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, వైద్యాధికారి టి.మురళి, మండల సచివాలయాల కన్వీనర్ పృధ్వీనాథ్, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లె సచివాలయం వద్ద మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని సర్పంచ్ వనజమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 179మందికి వైద్య పరీక్షలు చేపట్టినట్లు వైద్యాధికారి సోనియా తెలిపారు. ఎంపీడీవో వరప్రసాద్, ఎంపిటీసీ సర్వేశ్వరమ్మ, సర్పంచ్ వనజమ్మ, వైస్ ఎంపీపీ ప్రభాకర్, నాయకులు అమాస మోహన్, వెంకటరమణారెడ్డి, వైద్యాధికారి బాలాజీ, కార్యదర్శులు మసూదాబేగం, లలితకుమారి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓపీఎస్‌కు మద్దతు తెలుపుదాం: సరిత

పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఓపీఎస్‌కు మద్దతు తెలుపుదామని జిల్లా యూటీఎఫ్ కార్యదర్శి సరిత అన్నారు. మంగళవారం మండలంలోని తుంభకుప్పం ఉన్నత పాఠశాల, సచివాలయంలో ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను మండల అధ్యక్షులు మొగిలయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఓపీఎస్ వలన ఉద్యోగులకు లాభం కలుగుతుందని ఓపీఎస్ దూరంగా ఉంచేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్ణయాలను తీసుకుని రద్దు చేశాయని తిరిగి ఓపిఎస్‌ను కొనసాగించాలని ఓట్ ఫర్ ఓపిఎస్ కార్యక్రమం ప్రారంభించామని తెలిపారు. దీనికి ప్రభుత్వ ఉద్యోగులు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం పార్థసారథి, ఉపాధ్యాయులు నాగయ్య, రమేష్, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు: ఎంపీ

చెక్కు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గంగవరం: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. మంగళవారం గంగవరం మండలంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటే గౌడతో కలిసి లబ్ధిదారులకు ఆసరా చెక్కును అందజేశారు. మహిళలను ఆర్థికంగా ముందుకు తీసుకురావాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

సహాయ నిధి అందజేత

బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడికి సీఎం సహాయ నిధి చెక్కును సర్పంచ్ ధనంజయవర్మ, ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హమీద్‌ఖాన్ ఆధ్వర్యంలో ఎంపీపీ లతబాలాజీ చేతుల మీదుగా అందజేశారు. కాగా బాధితుడు షరీఫ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న డిప్యూటి సీఎం నారాయణస్వామి తక్షణమే స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్‌ను వర్తింపజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేషాద్రి. ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

విజయానందరెడ్డి దాతృత్వం

కుంటుంబ సభ్యులను ఆర్థికసాయం అందిస్తున్న విజయానందరెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పొట్ట కూటి కోసం చిత్తూరుకు వచ్చి ప్రమాద రీత్యా ప్రాణాలు పోగొట్టుకున్న మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు రాకేష్(23) కుటుంబ సభ్యులను వైసిపి అభ్యర్థి విజయానంద రెడ్డి ఆదుకున్నారు. గత్ నెల రోజులుగా సీట్ సెంట్రింగ్ కూలీగా పని చేసి కుటుంబాన్ని పోషించటానికి చిత్తూరు వచ్చిన రాకేష్ సోమవారం సాయంత్రం ఇరువారం సమీపంలో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఏం చేయాలో పాలుపోని తోటి కార్మికులు విజయానందరెడ్డి, జైన్ సంఘం దృష్టికి తేవటంతో వారు వెంటనే స్పందించారు. మృతిడి వివారాలను కనుగొని మతదేహాన్ని స్వస్థలం పంపే కార్యక్రమం చేపట్టారు. మధ్యప్రదేశ్‌లో గల మతుడి తల్లిందండ్రులు, బంధువులకు రాకేష్ మతదేహాన్ని కడసారి చూపులకు జైన్ సంఘం సహాయ సహకారాలతో ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్థికసాయంతో పాటు ఫ్లైట్ టికెట్‌లను అందించారు. ఈ సందర్భంగా కార్మిక, కర్షకులు కృతజ్ఞతలు తెలిపారు.

సన్మానం

వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డికి మొదిలియార్ సంఘం సీనియర్ నాయకులు, ప్రధాన కార్యదర్శి సీఎన్.రాజశేఖర్ సంపూర్ణ మద్దతు తెలిపారు. 43వ డివిజన్‌లో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా విజయానందరెడ్డిని రాజశేఖర్‌తో పాటు పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. కార్పొరేటర్ నవీన్, సంఘ నాయకులు ఆరుముగం, ఏజి.బాలజి, ఆర్‌బిఎన్.రవి, గురుగణేష్, ఉదయ్, రాం గణేష్, సుకుమార్, బాలమురుగన్‌లు పాల్గొన్నారు. అనంతరం రాజశేఖర్ స్వగహంలో మొదలియార్ సంఘం నేతలతో సమావేశమయ్యారు.

అంగన్వాడీ కేంద్రాల సందర్శన

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న రాష్ట్ర బృందం

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండలంలోని పద్మ సరస్సు తూర్పు అరుంధతివాడలోని అంగన్వాడీ కేంద్రాన్ని రాష్ట్ర విద్యాశాఖ బృందం మంగళవారం సందర్శించారు. అందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లోని వస్తువులను, వసతులను పిల్లల సంఖ్యను, వారి సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎఫ్ఎల్ఎన్ కన్సల్టెంట్ బాలకృష్ణ ప్రథం ప్రతినిధి గీత, పద్మ సరస్సు అంగన్వాడి కేంద్రాలను ఆదర్శ ఫౌండేషన్ స్కూల్ ఎన్నిక చేశారు. భవిష్యత్తులో ఈ ఆదర్శ ఫౌండేషన్ స్కూలుకు అనేక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆదర్శ ఫౌండేషన్ స్కూల్‌లోని పనిచేసే ఉపాధ్యాయులకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఇస్తుందన్నారు. పిల్లలు చిన్న చిన్న కథలు చక్కగా చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షణ సీఎంవో జయప్రకాష్, డైట్ ఇన్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, మండల విద్యాశాఖ అధికారులు విజయకుమార్, మనోజ్‌కుమార్, సిడిపివో పద్మసునంద, పర్యవేక్షకులు షామిని, ఏఈ నాగభూషణం, సిఆర్పిలు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోండి: ఆనంద్ గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-పుంగనూరు: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకొనే బాధ్యత యువతపై ఆధారపడి ఉందని రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత సంయుక్తంగా మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలల్లో ఓటు హక్కు వినియోగంపై సమాజంలో ప్రస్తుతం నెలకొంటున్న పరిస్థితులు, అవగాహన ఇవ్వడం జరిగిందన్నారు. ఓటు కున్న విలువ నిరుద్యోగ యువతకు ఎంత ఉపయోగపడుతుందన్న విషయాన్ని తెలియజేశామన్నారు. విజన్ ఉన్న నాయకులు రాష్ట్రానికి అవసరమన్నారు. సమావేశంలో తెలుగు యువత రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు పాలడుగు రెడ్డప్పనాయుడు, రాష్ట్ర స్పోర్ట్స్ పర్సన్ రమేష్ మర్పూరి, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కాలువ గడ్డమునీంద్ర, ఉపాధ్యక్షుడు హేమాద్రి, ఇమ్రాన్, రాజంపేట పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షురాలు షబానా, బాలాజీ, ప్రకాష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో భరత్ గెలుపు తధ్యం: దుర్గ

ప్రజాశక్తి-రామకుప్పం:
కుప్పం వైసీపీ ఎమ్మెల్యేగా భరత్ గెలుపు తధ్యం అని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ సతీమణి దుర్గ పేర్కొన్నారు. మంగళవారం మిట్టపల్లి గ్రామంలో పత్రిక సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా గత సంవత్సరం దసరా పండుగ నుంచి కుప్పం నియోజకవర్గంలో పర్యటించి 70వేల కుటుంబాలకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించినట్లు చెప్పారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా భరత్ ప్రజల్లో ఉన్నారని స్పష్టం చేశారు. గ్రామాల్లో మహిళా గ్రామ సభలు నిర్వహించి ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చామన్నారు. 'జగన్‌తో జనం.. భరత్ అన్నతో మనం' కార్యక్రమంకు మంచి స్పందన లభించిందన్నారు. రానున్న ఎన్నికల్లో భరత్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జెడ్పిటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మురళి, కోఆప్షన్ సభ్యుడు బర్కతుల్లా, నాయకులు ఏజస్, కేశవరెడ్డి, చెంగారెడ్డి, యశ్వంత్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదృశ్యమైన బాలుడు మృతి

మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు

ప్రజాశక్తి-సోమల:
మండలంలోని అన్నెమ్మగారిపల్లి పంచాయతీ ఎర్రగుంతలవారిపల్లెకి చెందిన ప్రత్యేక ప్రతిభావంతుడు రిషికేశవ(15) ఈనెల 9వ తేదీ ఇంటి వద్ద నుండి కనిపించకుండా పోయాడు. చివరకు ఆ బాలుడు గ్రామానికి సమీపంలోని ఓ బావిలో పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఎర్రగుంతలవారిపల్లె గ్రామానికి చెందిన మధుబాబు అక్క కుమారుడైన రుషికేశవ పుట్టుకతోనే మూగ, చెవుడు కలిగి ఉన్నాడు. మధుబాబు అక్క ఎనిమిది సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఋషికేశవను తన వద్దనే పెంచి పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీ శుక్రవారం మధుబాబు తల్లి సావిత్రమ్మ బాలుడిని సంరక్షిస్తూ సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో బయటకు వెళ్ళింది. తిరిగి ఇంటికి వచ్చి చూడగా బాలుడు కనిపించకపోవడంతో గ్రామం మొత్తం చుట్టుపక్కల వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో సమీప బంధువుల ఇళ్లకు కూడా వెళ్లి 10వ తేదీ మొత్తం గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో 11వ తేదీ సోమల పోలీసులకు బాలుడు అదృశ్యమైన విషయాన్ని ఎస్ఐ వెంకట నరసింహులుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి కనిపెట్టాలని కోరారు. అయితే 13వ తేదీ మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో మృతదేహం తేలుతూ ఉందన్న సమాచారం గ్రామంలో వ్యాపించడంతో వెళ్లి పరిశీలించగా అది రిషికేశవ మృతదేహంగా గుర్తించారు. దీంతో మృతుడి అమ్మమ్మ, మేనమామ ఇతర కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించడం అక్కడ ఉన్న వారిని కలచివేసింది. పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు వచ్చి బావిలో నుండి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. కాగా సర్పంచి వనజమ్మ, వైసీపీ నాయకులు రమణారెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

అక్రమ మద్యం కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో కర్నాటక మద్యాన్ని విక్రయిస్తున్న భాగ్యరాజ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు చిత్తూరు నగరంలో కర్నాటక మద్యాన్ని విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 250మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

పలమనేరు: అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యం స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు.. పట్టణంలోని రాగువిరారెడ్డి కాలనీలో ఉంటున్న బుజ్జమ్మ అనే మహిళకు ఇద్దరు యువకులు కర్నాటక మద్యం సరఫరా చేస్తున్నట్లు గుర్తించి దాడులు చేశామన్నారు. మంగళవారం ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.50వేలు విలువైన కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టబుళ్లకు రివార్డులు అందజేశారు. ఎస్ఐ సహదేవిని అభినందించారు.

డ్రంక్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జరిమానా

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:
తప్ప తాగి వాహనం నడిపిన ఇద్దరికి రూ.10వేలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి తీర్పు ఇచ్చారు. సోమవారం వాహన తనిఖీ సమయంలో మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ట్రాఫిక్ పోలీసులు మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టగా వారికి జడ్జి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించారు. మద్యం తాగి పట్టుపడితే వారికి జరిమానాతో పాటు 3నుంచి 6నెలల వరకు జైలు శిక్షపడే అవకాశం కూడా ఉందని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు తెలిపారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE :: NAGARI
I.A.NO. 655/ 2022, O.S. No. 117 / 2022
BETWEEN:-
A. Harsha and another ....Petitioners/Plaintiffs
AND:-
A. Munemma and others .....Respondents / Defendants
NOTICE TO RESPONDENT NO ::3, 4 & 6
R3 : A. Ramakrishna,
S/o Yogi @ Late Gangadharam,
R4 : A.Jayasree, D/o Late Gangadharam,
R6 : M. Ambika, W/o Bhaskar Naidu, residing at Kaipakkam Village, Padiri Post, Nindra Mandal, Chittoor Dist.
R3 and R4 are residing at Padiri Village, Nindra Mandal, Chittoor Dist.
The plaintiffs filed a suit against you for partition of the suit schedule mentioned properties. the above suit is posted for your appearance before this Hon'ble court on : 06-03-2024 in person or through your advocate at about 10.30 am, and file your objection if any otherwise the matter will be decided Ex-Party.
Date of hearing : 06-03-2024.
B. Raveendra, B.Sc., B.L.,
U.S. Rayudu, M.Sc., B.L.,
C. Mohan Kumar., LLB.,
Advocates/Nagari.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE :: NAGARI
O.S. No. 117 / 2022
BETWEEN:-
A. Harsha and another ....Plaintiffs
AND:-
A. Munemma and others .... Defendants
SUMMONS AND NOTICE TO DEFENDANTS NO ::3, 4 & 6
D3 : A. Ramakrishna,
S/o Yogi @ Late Gangadharam,
D4 : A. Jayasree, D/o Late Gangadharam,
D6 : M. Ambika, W/o Bhaskar Naidu, residing at Kaipakkam Village, Padiri Post, Nindra Mandal, Chittoor Dist.
D3 and D4 are residing at Padiri Village, Nindra Mandal, Chittoor Dist.
The plaintiffs filed a suit against you for partition of the suit schedule mentioned properties. The above suit is posted for your appearance before this Hon'ble court on : 06-03-2024 in person or through your advocate at about 10.30 am, and file your objection if any otherwise the matter will be decided Ex-Party.
Date of hearing : 06-03-2024.
B. Raveendra, B.Sc., B.L.,
U.S. Rayudu, M.Sc., B.L.,
C. Mohan Kumar., LLB.,
Advocates/Nagari.